క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పంపిణీ చేస్తున్న సిటిజన్స్ ఫోరం బాధ్యులు

హవేళీఘణాపూర్(మెదక్): జిల్లా కేంద్రంలోని ఎంజేపీ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఆనందం మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఖేడ్‌కు తరలిన పీఆర్టీయూ నాయకులు



నారాయణ్‌ఖేడ్‌కు తరలివెళ్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ పదవి విరమణ సందర్భంగా జిల్లా నుంచి ఆ సంఘం నాయకులు ఆదివారం నారాయణ్‌ఖేడ్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ సంఘం అభివృద్ధికి గుండు లక్ష్మణ్ చేసిన సేవలను కొనియాడారు. వెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ బాధ్యులు మల్లారెడ్డి, సుంకరి కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, సంతోష్, రాజు, వీరేశం ఉన్నారు.

యువకుల స్వచ్ఛభారత్



కూచారంలో మొక్కలు నాటుతున్న నేచర్‌ఐకాన్ యూత్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్‌యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపుల మొక్కలు నాటారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి వీరశైవ లింగాయత్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పు వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పట్లోళ్ల సాయి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ముద్దాపురం నాగప్ప, సహాయ కార్యదర్శిగా నర్సప్ప, కోశాధికారిగా గటంగారి ఈశ్వరప్ప, కార్యవర్గ సభ్యులుగా శ్రావణ్, వీరప్ప, శరణప్ప, సందీప్, ఆనంద్, అరవింద్, మల్లేశం, రవిందర్, శివకుమార్, చంద్రప్ప, విజయ్, బసవరాజ్, రవీందర్, శ్రావణ్, కుమార్, వీరన్న, వీరయ్య స్వామి, రాజు, చిన్న వీరప్ప, రజిత, యశ్వంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత



అవగాహన కల్పిస్తున్న హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ సభ్యులు

చేగుంట(తూప్రాన్): ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ బృందం సభ్యులు రష్మిపాండే తెలిపారు. ఆదివారం మండలంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కోసం కృషి చేయాలన్నారు. ధ్యానంతో మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు ఉల్లాసంగా పని చేసేందుకు దోహద పడుతుందన్నారు. అలాగే మనస్సును అదుపులో ఉంచుకుంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, ఆదిశేషు, అభిమన్యు, రాంనివాసీ పాల్గొన్నారు.

రేషన్.. సంబురం!



రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్న నూతన రేషన్ కార్డుదారుడు

- 974 కొత్త రేషన్‌కార్డులకు సైతం సన్న బియ్యం
- ప్రతీ నెల అదనంగా 174 క్వింటాళ్ల రేషన్
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. అయితే కొత్తగా రేషన్ కార్డు కోసం లబ్ధిదారులు పదేళ్లుగా లీడర్లు, కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయారు. ఇక భవిష్యత్‌లోనూ రేషన్ కార్డులు దక్కే అవకాశం రాదేమో అనుకున్న తరుణంలో ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అర్హులందరికీ రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియను తక్కువ వ్యవధిలోనే పూర్తి చేసి సన్న బియ్యం పంపిణీ చేయడంతో నూతన రేషన్ కార్డుదారులు సంబుర పడుతున్నారు.

రేగోడ్(మెదక్): మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో గతంలో 5,970 రేషన్ కార్డులు ఉండగా.. 20,920 సభ్యులు ఉన్నారు. వీరందరికీ 420 క్వింటాళ్ల రేషన్ బియ్యం ప్రతీ నెల ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అయితే పదేళ్లుగా చాలామంది కొత్త రేషన్ కార్డు లేక ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఆ వెంటనే ప్రభుత్వం 974 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఈ కార్డుల్లో సుమారు ఐదు వేల మంది సభ్యులు ఉండగా.. 173 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. కొత్త కార్డుల లబ్ధిదారులతో రేషన్ దుకాణాలు సందడిగా మారాయి. రేషన్ కార్డులపై ఆశలు వదులుకున్న తరుణంలో ప్రజలకు ప్రభుత్వం భరోసా నింపడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అర్హులందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేయడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

సన్నబియ్యం తీసుకుంటున్నా..



ఎనిమిదేళ్ల క్రితం రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగి అలసిపోయా. ఎవరూ రేషన్ కార్డు మంజూరు చేయలేదు. చేసేదిలేక ఆశలు వదులుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరు చేసింది. ఇటీవల నూతన రేషన్‌కార్డు ఇచ్చారు. కొత్త కార్డుతో సన్న బియ్యం తీసుకుంటున్నా.

– దత్తు, రేగోడ్

బడిలో పేరుకుపోయిన చెత్త



లింగారెడ్డిపేట్ పాఠశాలలో పేరుకుపోయిన చెత్త

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో చెత్త పేరుకుపోయింది. దీంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో చెత్త చెదారం పేరుకపోయిన ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులు..



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఆయా పాఠ్యాంశాలను బోధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సృజ, ఉపాధ్యాయులు, సంతోశ్, నాగరాజు తదితరులు పర్యవేక్షించారు. అనంతరం ప్రతిభ కబనర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని వెనుకతండా, నడిమితండాల్లో ఆదివారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాల్లో అనారోగ్యానికి గురైన బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాల సీజన్‌తో జ్వరాలు వస్తున్నాయని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొంతమందికి జ్వరం తీవ్రంగా ఉండడంతో రక్త పరీక్షలు నిర్వహించి ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌టెక్నీషియన్ రాంచంద్రం, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



కెమెరాలు బిగిస్తున్న యూత్ సభ్యులు

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూరలో ఎస్ఐ రాజేష్ ఆదేశాల మేరకు విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ రాజాయూత్ ఆధ్వర్యంలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన రాజాయూత్ సభ్యులను ఎస్ఐతో పాటు జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గౌతంరాజ్ అభినందించారు. కార్యక్రమంలో రాజా యూత్ సభ్యులు దస్తగిరి, అంజన్న, అబిషేక్, శ్రీను, దుర్గాప్రసాద్, వెంకటేష్, మల్లేశం, సన్ని, మహేష్, సుదర్శన్, మదు, కిషోర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రాకపోకలు



రోడ్డుపై పారుతున్న నీరు

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కోంటూర్ చెరువు అలుగు పారుతోంది. గత మూడు రోజుల క్రితం అలుగు ఉధృతికి రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. తిమ్మానగర్ చెరువు కుంట అలుగు స్వల్పంగా పారుతోంది.



రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు

రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు కాపాడాలి

కొల్చారం(నర్సాపూర్): రిటైర్డ్ ఉద్యోగుల హక్కులను కాపాడడంతో పాటు ప్రభుత్వం అందించే సౌకర్యాలను కల్పించాలని జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగదీష్ చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో సమావేశమై మండల రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సామ్యూల్, అసోసియేషన్ అధ్యక్షుడిగా దశరథ్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్‌సాజత్ అలీ, యూసుఫ్, కార్యదర్శిగా సుధాకర్, మహిళా ఆర్గనైజేషన్ సెక్రటరీగా నాగమ్మ, ప్రచార కార్యదర్శిగా షాబుద్దీన్ ఎన్నిక య్యారు. అనంతరం ఎన్నికైన వారిని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణతో కలిసి ఆయన నియామక పత్రాలతో పాటు శాలువా కప్పి అభినందించారు.

నిరుపేదలకు టార్పాలిన్ల పంపిణీ



చిన్నశంకరంపేట: రామాయపల్లిలో నిరుపేదలకు టార్పాలిన్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు



సదాశివనగర్ తండాలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రామాయపల్లిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు రక్షణ కోసం హైదారాబాద్‌కు చెందిన ఇక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజశేఖర్‌రెడ్డి, సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ, సభ్యులు శ్రీకాంత్, వినోద్, జీవన్ ఉన్నారు.

సదాశివనగర్ తండాలో..

రామాయంపేట(మెదక్): మండలంలోని సదాశివ నగర్ తండాలో నిరుపేదలకు ఇక్షణ సానీక్ష ఫౌండేషన్ సభ్యులు ఆదివారం టార్పాలిన్లు పంపిణీ చేశారు. భారీ వర్షాలతో పాక్షికంగా ఇళ్లు కూలిపోయిన బాధితులకు అందజేశారు.

మల్లికార్జునగౌడ్‌కు ఉత్తమ అవార్డు



మల్లికార్జున గౌడ్

టేక్మాల్(మెదక్): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మండలంలోని కుసంగికి చెందిన మల్లికార్జునగౌడ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాడు. ఈ మేరకు లయన్స్ క్లబ్ చౌర్మన్ బాబురావ్, లయన్స్ క్లబ్ డైరెక్ట్ గౌవర్నర్ అమృతరావ్, ఐఏఎస్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆయనకు తోటి ఉపాధ్యాయులతో పాటు కుసంగి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు సమావేశం

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సోమవారం నిజాంపేట్ మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉ.11.30గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నాయకులు హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



పెద్దశంకరంపేటలో..



రామాయంపేటలో గణనాథుడి నిమజ్జనం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం పెద్దశంకరంపేట, బుజ్రాన్‌పల్లి తదితర గ్రామాలలో ప్రతిష్ఠించిన వినాయకులను భజనలు, కీర్తనలు, కోలాటాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా చెరువులలో నిమజ్జనం చేశారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి నిర్వహించిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర ఆకట్టుకుంది. రంగు రంగుల విద్యుత్ దీపాల కాంతులతో పాటు యువకుల నృత్యాలు చేస్తే గణనాథులను గంగమ్మ ఒడికి చేర్చారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం

రామాయంపేట(మెదక్): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వినాయన నిమజ్జనోత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చెరువులవద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

గ్రహణ ప్రభావం

- ఆలయాల మూసివేత
- నేడు సంప్రోక్షణ పూజలు



కాడిపల్లి: తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో..



శివ్వంపేట: సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు



చిట్కుల్ శివారులో చాముండేశ్వరి ఆలయ ద్వారాలు మూసేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ప్రముఖ ఆలయాలను ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. ఈ మేరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి, చాకరిమెట్ల ఆంజనేయస్వామి, శివ్వంపేట బగలాముఖీ శక్తిపీఠం, దొంతి వేణుగోపాలస్వామి ఆలయాలు మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వేద పండితులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, వామనశర్మ, చాకరిమెట్ల ఆలయ పౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మలు తెలిపారు.

తునికి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం బంద్ చేశారు. ఉదయం ఆలయ పూజారి శివప్ప అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం వరకు భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తర్వాత గ్రహణం కారణంగా అమ్మవారి విగ్రహం చుట్టూ బంధన వేసి ఆలయాన్ని బంద్ చేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి చెప్పారు.

ఆలయాల మూసివేత..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయం, చందూర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయాలను ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో మూసేశామని అర్చకులు తెలిపారు. గ్రహణం పూర్తయిన తర్వాత ఆలయ సంప్రోక్షణ, అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఆలయం తెరుస్తామని అర్చకుడు ప్రభాకర శర్మ అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు టేక్మాల్‌కు మంత్రి దామోదర

టేక్మాల్(మెదక్): మండలంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేష్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు రూ.5 కోట్లతో చేపట్టే చింతకుంట రోడ్డు నుంచి కొత్తపల్లి రోడ్డు, రూ.3 కోట్లతో ధనూర నుంచి టేక్మల్ చౌరస్తా రోడ్డు, రూ. 5.19 కోట్లతో టేక్మాల్ నుంచి చౌరస్తా నుంచి ఎల్లుపేట్ రోడ్డు, రూ.3.26కోట్లతో వెంకటాపూర్ నుంచి తండా రోడ్డు, రూ.12 కోట్లతో పాపన్నపేట మండలం నార్సింగ్ నుంచి శంకరంపేట రోడ్డు, రూ.22.50లక్షలతో చేపట్టే ఎల్లుపేట పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ నేడు ప్రజావాణి

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఐ ఫెరోజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ నేడు ఆల్‌పార్టీ మీటింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 8వ తేదిన ఉదయం 11గంటలకు అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): ఎంపీటీసీ ఎన్నికలు 2025లో భాగంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆల్ పార్టీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రఫిక్ ఉన్నిసా తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల మార్పులు చేర్పులపై సమావేశం ఉంటుందని, అన్ని పార్టీలకు చెందిన నాయకులు హాజరు కావాలని కోరారు.

◆ నేడు పశువైద్యశాఖ మందుల పంపిణీ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అన్ని పశువుల ఆస్పత్రులకు సోమవారం మందులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశువైద్యశాఖ అధికారి వెంకటయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పశువులకు కావాల్సిన అన్ని రకాల మందులు జిల్లా కేంద్రానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. వర్షాకాల సీజన్ కావడంతో మూగజీవాలు ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా కావాల్సిన మందులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వైద్యులు వచ్చి మందులు తీసుకెళ్లానని వెంకటయ్య సూచించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం



మత్స్య సహకార సంఘం భవనం

నర్సాపూర్: కనీస వసతులు కల్పించకపోవడంతో మత్స్య సహకార సంఘ భవనం నిరుపయోగంగా మారింది. మండలంలోని జగన్నాథరావు కాలనీ సమీపంలో సంబంధిత అధికారులు మత్స్య సహకార సంఘం భవనం నిర్మించి కనీస వసతులు కల్పించకపోవడంతో వృథాగా ఉంది. మత్స్య భవనానికి కనీసం నీటి వసతి కూడ కల్పించకపోవడం గమనార్హం. భవనంలో నీళ్ల లేకపోవడంతో అక్కడ చేపల దుకాణాలు పెట్టేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. అలాగే భవనం ఎదుట ఖాళీ స్థలంలో సీసీ రోడ్డు లేకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. దీంతో చేపల వ్యాపారులు పట్టణంలోని షాదీఖానా సమీపంలో చేపల దుకాణాలు రోడ్డుపైనే ఉంచి విక్రయిస్తున్నారు. అయితే చేపల దుకాణాల పక్క నుంచి పెద్ద మురుగు కాల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. చేపలు కొనేందుకు వచ్చే ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చేపల వ్యాపారం కోసం నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.